

# వర్ధనివ్య

— కొప్పిలిపాటి విజయలక్ష్మి

వర్ధని నవ్వింది. ఆ నవ్వులో మార్పేమీ లేదు. నలభై సంవత్సరాల క్రితం - తొమ్మిదేళ్ళ అమ్మాయిగా ఉన్న వర్ధని ఎలా నవ్విందో-అలానే నవ్వింది ఇవ్వాళ కూడా. ఎంతకాలం తర్వాత చూశాను వర్ధనిని!

"వర్ధనీ! బాగున్నావా? నువ్వేమీ మారలేదు" అని ఆమె వైపు నిండుగా సంతోషంగా చూస్తూ, "తొమ్మిదేళ్ళ అమ్మాయిగా ఉన్నప్పటి నవ్వే ఇప్పుడు" అన్నాను.

"అబద్ధాలాడకు. నేను అప్పటికన్నా లావెక్కలేదూ? మునపటిలా నాజూగ్గా ఉన్నానంటావా? తల నెరిసింది. ముఖంలో ముదిమి తొంగి చూస్తూంటే నేనేమీ-మారలేదట" అని మళ్ళీ నవ్వి, తల వంచి క్షణం మౌనం తర్వాత, " నేను త్వర త్వరగా మారిపోగలను పార్థూ!" అంది వర్ధని. ఆ గొంతు బరువుగా, బాధగా ధ్వనించింది.

"అవును-త్వరత్వరగా మారిపోగలవు" అన్నాను గతం నెమరు వేసుకుంటూ.

గతం కాక వర్తమానం, భవిష్యత్‌లో ఏముంది? వట్టి శూన్యం తప్ప! చావలేను కనుక బ్రతుకుతున్నాను. బ్రతకడానికి తిండి తినాలి కనుక తింటున్నాను. తిండికి డబ్బు కావాలి కనుక ఉద్యోగం చేస్తున్నాను.



"అవును-త్వరత్వరగా మారిపోవాలి. ఆడదాన్ని కనుక మారినా మారక పోయినా, మారినట్లు నటించాలి" అంది వర్ధని.

"మారినట్లు నటనా?" తెల్లబోయి అన్నాను.

"అవును పార్థూ! కాకపోతే తొమ్మిదేళ్ళ అమ్మాయి నవ్వూ, నలభయ్యేళ్ళ వర్ధనమ్మ నవ్వూ ఒకేలా ఉంటాయా? అల్లరిగా, అమాయకంగా ఉండే ఆ నవ్వుకూ-నిజంగా, హుందాగా ఉండే ఈ నవ్వుకూ వ్యత్యాసం లేదూ? అయినా ఎవరో రాయగా చదివాను-నవ్వుల్లో చాలా రకాలున్నాయిటలే. మరే రకానికి చెందినదో నా నవ్వు? ఊఁ-కబుర్లేమన్నా చెప్పు!" అంది వర్ధని-నాయుడిగారి తోటలో

పిమ్మెంటుబెంచీ మీద కూర్చుంటూ.
"ఏమున్నాయి కబుర్లు? నువ్వే చెప్పు!" అన్నాను.

రంగారాయపురంలో పుట్టాం నేనూ, వర్ధనీ. వర్ధని నా కన్నా ఆర్నెల్లు పెద్దదట. ఆ సమస్యే మమ్మల్ని భార్యా భర్తలు కాకుండా చేసింది. ఉదయాన్నే ఇద్దరం కలిసి బడికి వెళ్ళేవాళ్ళం. ఒకే క్లాసు చదివేవాళ్ళం.

అప్పుడు రంగారాయపురంలో ఉన్నది ఎలిమెంటరీ స్కూలే. ఐదవతరగతి వరకూ చదివి, వర్ధని స్కూలు మానేసింది. నేను కేరియరు తీసుకుని ఆ ఊరికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఊళ్ళోని హైస్కూలుకి పోయి చదివేవాణ్ణి. నేను స్కూలు నుంచి రాగానే మా ఇంటికి వచ్చేసేది వర్ధని. వర్ధనికి పద్నాలుగేళ్ళు వచ్చే దాకా ఎవ్వరూ మేం కలిసి మాట్లాడుకోవటానికి అభ్యంతరాలు చెప్పలేదు.

ఆ రోజు వర్ధని రాలేదు. "అమ్మా! వర్ధని ఊళ్లో లేదా?" అడిగాను అమ్మని మామూలుగా.

"ఉంది. నేనే రావద్దని చెప్పాను. ఈడొచ్చిన పిల్లలు-అలా అర్ధరాత్రి దాకా కబుర్లు చెప్పుకోవటం ఏం బాగుంటుంది?" అంది.

నా మనస్సు చివుక్కుమంది- అమ్మ వర్ధనిని రావద్దని చెప్పిందని తెలుసుకోగానే.

"అం - కొంపలు మునిగి పోతాయా?" అని చరచరా వర్ధని ఇంటికి నేనే వెళ్ళాను.

వర్ధని వాళ్ళ అమ్మా-నాన్నగారూ, నన్ను కొత్త వ్యక్తిని చూసినట్లు చూశారు.

"ఎందుకు వచ్చావు పార్థూ?" నవ్వబోతూ ప్రశ్నించింది వర్ధని తల్లి మహాలక్ష్మమ్మ.

"వర్ధని ఈరోజు మా ఇంటికి రాలేదని" అన్నాను తడబాటుగా- గుమ్మం దాటి గదిలోకి వెళ్ళబోయేవాడినల్లా ఆగిపోయి.

"ఇంకా చిన్న పిల్లలేమిటోయ్- కబుర్లు చెప్పుకుని నవ్వుకోవటానికి? మనది అగ్రహారం. నీకేం మగాడివి. ఆడపిల్ల మాట పడిందంటే పెళ్ళి కాదు" అందావిడ.

తలవంచుకుని మౌనంగా ఇంటికి వచ్చేశాను. నాకు-మా అమ్మ మీదా, వాళ్ళమ్మ మీదా, అగ్రహారం మీదా, మమ్మల్ని ఆడిపోసుకుంటారనే వారి మీదా కోపం వచ్చింది. అయినా ఏం చెయ్యను? నిస్సహాయంగా చేతులు నులుముకున్నాను. మరొక వారం రోజుల వరకూ అస్సలు నాకు వర్ధని కనుపించనే లేదు.

మా వీధి సందు చివర, పతకం పట్టు నుంచి కూరల సంచీతో వస్తున్న నాకు ఎదురై, "పార్థూ! మనం ఎక్కడ కలుసుకొందాం?" గుసగుసగా నెమ్మదిగా అడిగింది వర్ధని. క్షణం ఆలోచిస్తూన్నట్లు గుండె ఎందుకో దడదడా కొట్టు కుంటూంటే మౌనంగా ఉండి పోయాను. తర్వాత, "నువ్వే చెప్పు!" అన్నాను.

నవ్వి, "సాయంత్రం సరిగ్గా ఐదున్నర అయ్యేసరికి చెరువుకి నీళ్ళకని బయలుదేరి నాయుడిగారి తోటకు వస్తాను. నువ్వు ఆ దోవనే వస్తావు కదా స్కూలు నుంచి?" అంది నెమ్మదిగా. సంతోషంగా తల ఊపాను.

తర్వాత ఎన్ని సాయంత్రాలు ఈ బెంచీ మీద కూర్చొని కబుర్లు చెప్పుకున్నాము! ఎంత తియ్యగా మధురంగా గడిచాయా రోజులు! గుసగుసలతో ప్రారంభమయి గుప్పుమంది-మేం తోటలో మాట్లాడుకోవటం గురించి. అగ్ర హారంలో అనేక కథలు పుట్టాయి. ఓ రోజు అంది వర్ధని కనులనిండా నీరు నింపుకుని-"పార్థూ! మనం పెళ్ళి చేసుకుందాం పార్థూ!" అని.

ఆ రాత్రి మామూలుగా రోజు లానే అన్నం పెడుతూ, అమ్మ చీవాట్లేస్తూంది-"నీకేం బుద్ధి లేదురా పార్థూ! అదంటే బరితెగించి పోయింది...." అని ఇంకేమో అన బోయే అమ్మ మాటలు ఇంక విన లేని వాడిలా తల అడ్డంగా ఊపి, "వర్ధనిని నేను పెళ్ళి చేసుకుంటా నమ్మా?" అన్నాను.

ఆమె నోరావలించింది. "నీ కన్నా పెద్దదాన్ని-ఆ వర్ధనిని నువ్వు పెళ్ళి చేసుకొంటావా? బాగుందిరా బాబూ! నోరుముయ్యి. ఈ మాట నాన్న దగ్గర అంటే తోలు వలు స్తారు" అంది.

తర్వాత ఈ మాట నేను నాన్న దగ్గర అనటం, ఆయన నా మీద నిప్పుల వర్షం కురిపించటం, చెయ్యి చేసుకోవటం, నేను ఏడవ టం అయ్యాయి.

ఆ రోజు నుంచి నాన్న నా మీద నిఘా వేశారు. వర్ధని ఇంట్లో బందీ అయ్యింది. నే నాసంవత్సరం పరీక్ష తప్పాను. నాన్న నన్ను చదువుకి ఏలూరు పిన్నిగారింటికి పంపించారు. సెలవుల్లో ఇంటికి వచ్చిన నేను విన్నాను—వర్ధని పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళి పోయిందని.

నేను వెంటనే ఆ మాట నమ్మ లేక పోయాను. నన్ను పెళ్ళిచేసు కుందామనే కోరిక గుండెల నిండా

నింపుకున్న వర్ధని- మరొక వ్యక్తి ముందు తల వంచి ఎలా తాళి కట్టించుకుంది? అమ్మని అడిగాను- "అమ్మా! వర్ధనికి బలవంతంగా పెళ్ళి చేశారా?" అని.

"బలవంత మేమీ లేదు. చక్కగా సంతోషంగా చేసుకుంది. ముఖాన్న నవ్వు చెదర లేదు" అంది అమ్మ.

తర్వాత నాన్నగారు సడన్‌గా పోవటం, ఆ పోస్టు మాస్టరుగిరి నేను స్వీకరించటం సంవత్సరం తిరిగేసరికి జరిగిపోయాయి. కారణ మేమిటో వర్ధని పుట్టింటికి రాలేదు. ఆమె తల్లిదండ్రులు ఈ ఊరు నుండి కాపురం ఎత్తేసి కొడుకు దగ్గరకు వెళ్ళి పోయారు. వర్ధని చూపుల కందని దూరంలో ఉండి పోయింది.

అమ్మ—నన్ను పెళ్ళి చేసుకో మని చెవిన ఇల్లు కట్టుకుని పోరటం మొదలు పెట్టింది. ముప్ఫయి వచ్చేదాకా, ఆమె మాట త్రోసిపుచ్చుతూ వచ్చాను. అమ్మకు అకస్మాత్తుగా జబ్బు చేసింది. ఆ జబ్బుతో ఆమె చచ్చిపోతుందని ఆమెను సంతృప్తి పరచాలని, పెళ్ళి చేసుకుంటానని వాగ్దానం చేశాను. ఆమె పోలేదు. జబ్బుతగ్గి కోలుకోవటం ప్రారంభించింది.

ఆమెకు నచ్చిన అమ్మాయి చిట్టితో నాకు పెళ్ళి జరిపించేసింది. చిట్టి చాలా మంచిది. నేను ఒక్క రోజు కూడా ఆమెతో కాపురం చెయ్యలేదు. అయినా అల్లరి పెట్టి, నన్ను బజారుకీడ్వ లేదు. నాలుగైదు నెలలు గడిచాక, ఓ రోజు నన్ను హఠాత్తుగా ప్రశ్నించింది-"ఏమండీ! నన్ను పెళ్ళి చేసుకోవటం మీకు ఇష్టం లేదా?" అని. ఏమని జవాబు చెప్పను? చిట్టి అంటే నాకు అసహ్యం లేదు, కోపం లేదు. కాని ఆమెను భర్తగా దగ్గరకు తీసుకోలేను, ఆదరించ లేను. ఈ నాలుగైదు నెలలు ప్రయత్నించి నా మనస్సును నేను ఒప్పించలేక విఫలుణ్ణవుతున్నాను. నే నేమీ జవాబు చెప్పకుండానే మరో ప్రశ్న- "మీరు మగవారు కాదా?" అని.

ఆలోచించకుండా అప్పటి కిదే రక్షణ అనుకుని—"కాను" అన్నాను. అంతే! చిట్టి మరి మాట్లాడలేదు. గిర్రున తిరిగి వెళ్ళి పోయింది. మరో నాలుగు రోజుల తర్వాత మా పెరట్లో ఉన్న ఏతం నూతిలో పడి ప్రాణాలు వదిలింది. ఆమె ఆత్మహత్య చేసుకుందన టానికి ఎవ్వరికీ కారణాలు దొరక లేదు. అమ్మకి కోడలంటే ముద్దు.

అది అగ్రహారంలో అందరికీ తెలుసు. మా ఇద్దరం అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నా మనే అందరూ అనుకునేవారు. చివరకు అమ్మకూడా. రాత్రి అంట్ల గిన్నెలు చక్కబెట్టి వంటఇల్లు కడిగి, చిట్టి వచ్చి నా గదిలో చాప వాల్చుకు పడుకొనేది.

కాలు జారి పడిపోయిందన్నారు. అమ్మ గుండెలు బాదుకు ఏడ్చింది. నేను చేష్టలు దక్కి శిలాప్రతిమలా ఉండిపోయాను.

చిట్టి పోయిన తర్వాత మళ్ళీ పెళ్ళి చేస్తానని సంబంధాలు చూసే అమ్మని వారించాను- "మనస్సు కుదుట పడిన తర్వాత నేనే చేసుకుంటాను పెళ్ళి" అని.

రెండు సంవత్సరాలు గడిచాయి. అమ్మ పోయింది. వంటరి వాడి నయిపోయాను. లోకేశం మామయ్య-నాలుగైదు సంబంధాలు తెచ్చాడు. పెళ్ళి చేసుకోమని హితవులు చెప్పేవాడు. నాకేమిటో పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశ్యమే రాలేదు. వర్ధని గుర్తుకు వచ్చేది. ఆనాడు పెద్దల నెదిరించి పెళ్ళి చేసుకుంటే జీవితం ఎంత బాగుండేది? నాకిప్పటికీ బాగా జ్ఞాపకం- ఓ సారి అంది వర్ధని కనులనిండా నీరు నింపుకొని— "ఎవరేమనుకుంటే మన కేం? వెళ్ళిపోయి పట్నంలో రిజిష్ట్రాఫీసులో పెళ్ళి చేసుకుందాం పార్థూ!" అని. అది అంత సుళువుగా జరిగే పనిలా అనిపించలేదు నాకు. నేనుత్త పిరికివాణ్ణి. ఏదీ సాహసించి అందుకుని అనుభవించలేని వాణ్ణి.

"ఏమన్నా కబుర్లు చెప్పు పార్థూ!" అంది వర్ధని, గతం గజిబిజిగా నెమరు వేసుకుంటూ మౌనంగా ఉండిపోయిన నన్ను వాస్తవంలోకి తెస్తూ మళ్ళీ.

"నేను చెప్పటానికేమున్నాయి కబుర్లు? వంటరిగాడ్ని. పిల్లలు, భర్త, సంసారం- హాయిగా జీవితం సాగిస్తున్న దానవు, నువ్వు చెప్పు కబుర్లు! ఏమన్నా చెప్పటానికి నీకుంటాయి కబుర్లు" అన్నాను నవ్వబోతూ.

"పార్థూ! నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోలేదట కదూ? పోయిన భార్యను అంత గాఢంగా ప్రేమించావా?" అంది వర్ధని.

నవ్వాలో, ఏడవాలో తెలియ లేదు. "హుం! ప్రేమ" అని వెకిలి నవ్వు నవ్వి, "నా జీవితం మొద్దుబారి పోయింది వర్ధనీ! ఏమీ అనుభవించకుండా నన్ను నేను ఎందుకిలా శాసించుకున్నానో నాకే తెలియదు" అన్నాను.

చప్పున వర్ధని కనుల్లో నీరూ రింది. "మగవాడివి- నీకు కనుక జరిగిపోయింది. నా కెలా వీఁలవు తుంది? కట్టుకున్న వాడికి భార్యగా, మనసున్నా లేకపోయినా ఉన్నట్లు ప్రవర్తించాలి, సంసారం చెయ్యాలి, పిల్లల్ని కనాలి, వాళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యాలి, పురుళ్ళు పోయాలి" అని పిచ్చిదానిలా నవ్వింది వర్ధని.

ఆమె బాధ ఏమిటో నాకు అర్థం కాలేదు. తల వంచాను. రెండు నిమిషాలు ఇద్దరి మధ్యా భరించ లేని నిశ్శబ్దం.

వర్ధని చెబుతూంది- "పార్థూ! వయసులో పెద్దదాని నయినా నిన్నే పెళ్ళి చేసుకోవాలని ఎంతగా కోరు కున్నానో తెలుసా? నువ్వు ఉత్త పిరికివాడివి. లేకపోతే నన్ను లేవ దీసుకుపోయి పెళ్ళి చేసుకోవూ! ఆడది ఆ మాత్రం మనస్సు వ్యక్తం చేస్తే నిజంగా నీలా వదిలి పెడతాడా ఏ మగాడయినా? నీక్కూడా అంత యిష్టం కాదేమో అనుకున్నాను. నీ గురించి అంతా విన్నానులే. నీకు తెలుసో తెలియదో- ఈ ఊరి స్కూల్ మాస్టరుగారి అబ్బాయికి మా అమ్మాయిని ఇచ్చాం. సారె ఇచ్చి తీసుకు వెళ్ళటానికి వచ్చాను. నా పెళ్ళి అయి మా వాళ్ళు ఈ ఊళ్ళో ఇల్లూ వాకిలీ అమ్ముకు వెళ్ళిపోయాక, అస్సలీ ఊరు- ముఖ్యంగా నిన్ను జన్మలో చూస్తా నని అనుకున్నానా? ఇంతకీ భగ వంతుని దయ__నిన్ను చూశాను. ఎంతో సంతోషంగా ఉంది...." అని ఆమె నవ్వింది. ఈసారి పరిశీలనగా చూశా నామె వైపు. ఆమె మన స్ఫూర్తిగా నవ్వటం లేదు. నవ్వటం కృత్రిమంగా ఉంది. నవ్వాలని నవ్వినట్లుంది. నవ్వు పెదిమలకు అతికినట్లుంది.

"నన్ను బుచ్చిబాబుగారి కిచ్చి నాన్న పెళ్ళి చేసేశారా? అతను ముట్టుకుంటే తేళ్ళు- జెర్రులూ పాకినట్లుండేదనుకో. ఎన్ని దెబ్బలు తిన్నానో!"

ఆ మాట వినలేని వాడిలా, "వర్ధనీ!" అన్నాను.

"అవును పార్థూ! అతను నా నుంచి ఏమి అనుభవించాలని కోరు కున్నాడో! అతను తాకటంతోనే ముడుచుకుపోయేదాన్ని, కొత్తలో 'నేనంటే ఇష్టంలేదా? ఎందు కలా ఉంటున్నావ్?' అని ప్రశ్నించే వారు. జవాబుగా ఏడ్చేదాన్ని. 'ఛీ-ఛీ. ఏడవకు. నాకు అసహ్యం- ఏడుస్తూన్న నీ ముఖం చూడ టానికి' అని చీదరించుకునే వారు. కనీసం అతన్ని నవ్వే ముఖంతో

అన్నా సంతోషపెట్టాలని, కారణ మున్నా లేకపోయినా నవ్వటం అలవాటు చేసుకున్నాను. అతని మనస్సు కోరుకున్నట్లుగా నేను ప్రవర్తించలేక పోతూన్నందుకు ఒకోక్క రోజు తాగినవాడిలా, ఒళ్ళు తెలియకుండా నన్ను కొట్టేవా డతను. నోరు మెదపకుండా భరించే దాన్ని. ఇప్పుడు మారి పోయాడ నుకో. నా దారికి నన్ను వదిలి పెట్టాడు. ఇదంతా పది సంవత్స రాల క్రితం మాట. నా మనస్సు, నేను-ఎప్పుడో పరాధీన మైపోతే, అతని కివ్వటానికి నా దగ్గరేముంది? ఉత్త శరీరం తప్ప. అదిచ్చిన నేరానికి పిల్లలు, వాళ్ళ మీద ఏదో మమత. ఏమిటో జీవితం బొత్తిగా యాంత్రికమై పోయింది. నువ్వే నయం-గతం నెమరు వేసు కుంటూ రోజులు గడిపేస్తున్నావ్. నా కా గతం గుర్తు తెచ్చుకోవటా నికి కూడా తీరిక ఉండదు. పగ లంతా చాకిరీ. ఆయనగారు ఆయు ర్వేద వైద్యం చేస్తారు. ఏవో నూరడాలు-దంచడాలూ, వంటా-పెట్లూ, రాత్రి అయ్యేసరికి అలసట-నీర్సం-నిద్ర. ఇంకెక్కడి గత స్మృతులు" అని అలసినట్లు నిట్టూర్చింది వర్ధని.

వర్ధనిని చూస్తే జాలేసింది. 'ప్చ్-పాపం' అనుకున్నాను. మళ్ళీ చెప్పటం మొదలుపెట్టింది వర్ధని. "మొన్న సాయంత్రం వచ్చాను. నిన్న సారె పంపకమని ఊరంతా తిరిగాను వియ్యపురాలితో. మన చిన్నప్పటికీ, ఇప్పటికీ ఊరెంతో మారిపోయింది. చకచకా హై స్కూలు, కాలేజీ వచ్చేశాయి. ప్రక్క ఊరు, మన ఊరు కలిసి పోయాయట కదూ? అప్పట్లో కేరేజీ పట్టుకొని ఉదయాన్నే ఉసూరుమని పోయేవాడివి స్కూలుకి. సారె పంచుతూవచ్చి మీ గడపముందు ఆగిపోయాను. తలు పుకి తాళం పెట్టి ఉంది. మన ఎదురింటి సుబ్బమ్మత్త నన్ను గుర్తు పట్టింది. 'ఎంతదానవై పోయావు! ఎంత మారిపోయావు!' అని బుగ్గలు నొక్కుకుంది. 'పార్థూ ఇంట్లో లేడా?' అని అడి గాను. అంతే! గలగలా నీ చరిత్ర అంతా చెప్పేసి, 'నాయుడిగారి తోటలో ఆ పిమ్మెంటు బెంచీ మీద కూర్చుని ఏడుస్తూంటాడు-పోయిన పెళ్ళాం కోసం' అంది. బ్రతికిం చింది-నా కోసం ఏడుస్తున్నా వన లేదు" అని మళ్ళీ నవ్వింది వర్ధని.

కనులు చిమ్మిన నీరు పమిట చెంగుతో వత్తుకుని, "ఇవ్వాళ వెళ్ళి పోవలసిందే.ఆచాదస్తపు బ్రాహ్మడు

ముహూర్తం కూడా పెట్టాడు- ఇవ్వాళ ఉదయం పది గంటలకు బయలుదేరమని. కానిపార్థూ! నిన్ను చూసి మాట్లాడందే ఈ ఊరువదిలి వెళ్ళాలనిపించలేదు. ఉదయం విరేచనాలవుతున్నాయని అడుగడుగునా చెంబు పట్టుకున్నాను. 'వదినా! రేపు ఉదయం వెళ్ళండి. ఇప్పు డెలా వెళ్తారు?' అంది వియ్యపురాలు. రేపు వస్తున్నామని మావారికో టెలిగ్రాం కొట్టించాను. సాయంత్రం నువ్వెలాగూ తోటకి వస్తావు. అయినా ఈ నాయుడిగారి తోట, ఈ సిమ్మెంటు బెంచీ బ్రతికి ఉండగా మరచి పోగలనా? పార్థూ! నా జీవిత మంతా కృత్రిమమై పోయింది. ఉదయం లేచినది మొదలు-ఎన్ని పాత్రలు పోషించాలి నేను? అతనికి మనసిచ్చి పెళ్ళాడక పోయినా, అతనికి భార్యగా నటించాలి. అతనికి పుట్టిన ఆ పిల్లలన్నా నా కంత ప్రేమ లేదేమో! నలుగురు పిల్లలు-అందరి పోలికా తండ్రిదే. ఆ ముఖాలు నాకు నచ్చవు.వాళ్ళకి తల్లిగా నటించాలి. పార్థూ! మన శత్రువులు, మన జీవితాలు నాశనం చేసిన వాళ్ళు-మన తల్లిదండ్రులే కదూ!" అంది వర్ధని.

నిజమే అనిపించింది నాకు. "అవును-మనకు మేలుచేస్తున్నా మనుకుంటూ కీడుచేశారు. ఏమిటో వయస్సు వ్యత్యాసాలూ, కులాలూ! మనసు మనసుకు నచ్చిన మనువైతే ఇవ్వన్నీ ఎందుకు?" అన్నాను.

"పార్థూ! నన్ను మరచిపోయి ప్రాణాధికంగా భార్యను ప్రేమించావు. మళ్ళీ కబుర్లు చెబుతావు?" అంది వర్ధని.

ఈ సారి నేను నవ్వాను గంగలా. తర్వాత అంతా చెప్పాను. వర్ధని దగ్గర ఏమీ దాచలేదు.

"ప్చ్-పాపం! చిట్టికి అన్యాయం చేశావు" అంది వర్ధని.

"అవును-ఆత్మవంచనా, నటనా నాకు చాతకావు" అన్నాను నేను.

"అతను ఇష్టం కాదు. ఆ పిల్లలు ఇష్టంకాదు. అస్సలాసంసారం నాకు చెయ్యాలని ఉండదు. కాని ఈ సమాజం, మన చుట్టూ మనుషులు, బంధువర్గం, సాంప్రదాయాలూ, కట్టుబాట్లు........నన్నేం చెయ్యమంటావు పార్థూ?" అంది వర్ధని.

ఆ క్షణంలో గాలి వాటున ఎగిరే ఎండుటాకులా కనుపించింది నా కనులకు వర్ధని. నీలాటిరేవులో బిందెల చప్పుడు. చివాలున లేచింది వర్ధని. నిండా పమిట కప్పుకుని, "వస్తాను పార్థూ! దయఉంచు"అని చరచరా వెళ్ళిపోయింది.

ఇంటి ముఖం పట్టి నడిచాను. 'నన్నేం చెయ్యమంటావు పార్థూ?' వర్ధని గొంతు నా చెవుల్లో గింగురు మంటూంది. ఆమె నవ్వు నా కనుల ముందు మెదులుతూంది. *